# ఇదం జగత్

లోకం మీద కసి దీర్చుకుంటూన్నట్టుగా ఎండ ఉమ్మడి ముమ్మడిగా కాస్తోంది.

ముండువా ఇంటి వసారా అరుగుమీద కూర్చుని, కొడుకు శంకరానికి ఉత్తరం వ్రాశాడు గోవిందయ్య. పైపంచతో చిరుచెమట పట్టిన ముఖాన్ని తుడుచుకొని, నెమ్మదిగా నిట్టూర్పు విడిచాడు. మళ్ళీ ఓ సారి ఆ లేఖను మనస్సులో చదువుకున్నాడు.

అబ్బాయి శంకరానికి,

క్షేమం. నువ్వూ కులాసాగా ఉన్నావని భావిస్తున్నాను. నీ పెళ్ళి దాదాపు ఖాయమైనట్లే. పాలెం మునసబుగారు మోతుబరి రైతు. పేరుప్రతిష్ఠలు మెండుగల మనిషి. వంశమూ, సాంప్రదాయమూ, గౌరవ మర్యాదలూ – అన్నీ నచ్చాయి. ముఖ్యంగా ఆయన యివ్వజూపుతున్న కట్నానికి మనం ముందూ వెనుకా ఆలోచించి, ఆలస్యం చేయవల్సిన

పనిలేదు. భూమిగానీ, నగదుగానీలక్షరూపాయలకు ఏమాత్రం తగ్గదంటున్నాడు. మా అందరికీ పండుగ్గా వుంది. నా జీవితాశయం నెరవేరే మంచికాలం అంది పుచ్చుకున్నట్టుగా వుంది. పన్నెండవ తేదీన పెళ్ళిచూపులు. ఆ పైన ఈ నెలాఖరుకే మంచి లగ్నాలున్నాయి. ఈ పెళ్ళితో మన ఆస్తి యింకో లక్షకు పెరుగుతుంది. అంతకంటె ఇంకేం కావాలి? కొన్ని లక్షల రూపాయలు కళ్ళ జూడడంకంటె మానవునికి జీవితంలో సంతృప్తి ఏమిటి? పదో తారీఖుకే నువ్వు తప్పకుండా ఇంటికి రావాల్సింది. నీ దగ్గరున్న డబ్బును అతి మప్పితంగా వాడుకో. చెడు సహవాసాలకు పోవద్దు. సినిమాలూ, హోటళ్ళూ, జల్సాలూ, సిగరెట్లూ – వీటి జోలికివద్దు. నీ చదువేమిటో, నువ్వేమిటో — అంతే కావాల్సింది. నయాపైసాను రూపాయిగా భావించి, కోర్కెల్ని నొక్కిపట్టి, ఖర్చుల్ని తగ్గించుకోవటం కూడా ఒక రకమైన సంపాదనే. ఇంద్రియాలకు సుఖాలను అలవాటుజేస్తే ఎంతడబ్బూ చాలదు. ఈ రోజుల్లో ధనంతోనే ఉంది ప్రపంచం. డబ్బు చుట్టూ సంఘమూ, విలువలూ, హోదాలూ, మర్యాదలూ, ప్రేమలూ, అభిమానాలూ ప్రదక్షిణాలు చేస్తూ వుంటాయి. జేబులో రూపాయి తీసేందుకు ఎప్పుడు చేయిపెట్టినా ఆ సంగతి జ్ఞాపకం తెచ్చుకో! దుబారా ఖర్చుకు నీ మనస్సు ఒప్పలేదు. ఒప్పుకున్నదంటే నీ పతనానికి నువ్వు దారిచేసికుంటున్నావన్న మాటే! కానీకి కానీ, రూపాయికి రూపాయి ప్రాణప్రదంగా జీవితంలో ఏకైక ఆశయంగా సంపాదించాను

గనుక — నాకు డబ్బు విలువ తెలుసు, ఆ అనుభవంతోనే నీకు ఇంతగా వ్రాస్తున్నాను.

నువ్వు పదవ తారీఖునాడు తప్పకుండా ఇంటికి రావాల్సింది. వచ్చేటప్పుడు మూడోతరగతి టిక్కెట్టు కొనుక్కొని రైలుకి రా! బస్సుకైతే మూడణాలు జాస్తి.

—గోవిందయ్య.

ఉత్తరాన్ని స్వయంగా తపాలా పెట్టెలో వేశాడు గోవిందయ్య. అప్పుడుగాని ఆయనకు నమ్మిక చిక్కలేదు — నేరుగా ఆ ఉత్తరం అబ్బాయికి చేరుతుందని. ఏ కమతగాడికన్నా ఇచ్చి డబ్బాలోవేసి రమ్మంటే వాడు వేయనూ, వేయకపోనూ; ఒకవేళ వాడి హస్తవాసి మంచిది గాకుంటే అది చేరకపోనూ — ఎందుకొచ్చిన బెడదని ఆయననే స్వయంగా ఉత్తరాలు పోస్టు చేస్తూ వుంటాడు. ఆయన బహు అనుమానపు మనిషి. పిసరింత భరవాసా నెత్తిన బెట్టుకోడు. తనపట్ల లోకం ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించినా, లోకంపట్ల తను అపనమ్మకంగా ముఖం చిట్లిస్తేనే, నిర్మొహమాటంగా డబ్బు కూడబెట్టవచ్చు.

గోవిందయ్య పోస్టాఫీసునుంచి వొస్తూంటే, రథశాల దగ్గర అచ్చెయ్యగారి సుబ్బయ్య తూర్పు పొలాన్నుంచి వొస్తూనే కనబడ్డాడు. ఆయన భుజాన పై పంచెలో కట్టిన కూరగాయలమూట వ్రేళ్ళాడుతోం . గోవిందయ్య ఆప్యాయంగా పలుకరించాడు.

"ఏం సుబ్బయ్యా! వంగతోట దగ్గర్నుంచా ఏమిటి?

ఓ పూట కూరకు నాలుగు వంకాయలు నాకు పెట్టకూడదూ! చేలో కాసిన వంకాయల నన్నింటినీ మీరే తినవలెనా?”

సుబ్బయ్య మనస్సులో ‘ఈ పీడ ఎక్కడ దాపురించింది’ అని గొణుక్కుంటూనే భుజాన వ్రేలాడుతూన్న మూట విప్పి ఓ సవాసేరుకు నవనవలాడే వంకాయల్ని పెట్టాడు. ఆ వంకాయల్ని లొట్టలు వేసుకుంటూ గోవిందయ్య తన పై పంచలో మూట గట్టుకున్నాడు ‘వస్తాను బాబాయ్!’ అంటూ సుబ్బయ్య గబగబ వెళ్ళాడు. కొంతదూరం వెళ్ళి తపుక్కున రోడ్డుమీదకు ఉమ్మి వేసి, “ఛీ-ఛీ! ఏం బ్రతుకు! ఎన్ని లక్షలుంటే ఏంలాభం? అడుక్కుతినే బ్రతుకు! ఓపూట కూరకు వచ్చినా – ఓ బేడ మిగులుతుందనే ధోరణి. అణా కోసం ఆత్మాభిమానాల్ని వొదులుకునే పిసినారి!” అనుకున్నాడు సుబ్బయ్య.

ఎండలో, వొంటి నిండా చెమట కాలువలు గట్టి ప్రవహిస్తూండగా ఇంటి కొచ్చాడు గోవిందయ్య. ఆయ నెప్పుడూ చొక్కా ధరించడు. ఆ నీర్కావి ధోవతీ, పై పంచే ఆయన దుస్తులు. “ఏం గోవిందయ్యా! పేరుకు లక్షాధికారివే గానీ, వేసంలో పేదరైతువేను” అని ఎవ్వరైనా అంటే, “గుడ్డ కోసం డబ్బు తగలేస్తే ప్రయోజనం ఏమిటి ? పట్టుపంచెలు కట్టుకుంటే నాకేమయినా పట్టాభిషేకం చేస్తారా?” అంటాడు గోవిందయ్య. వయస్సు యాభై దాటినా, దృఢమైన కండర పుష్టి గలవాడు. మొదట్నుంచీ కాయకష్టానికి అలవాటుపడిన శరీరము. ఇప్పుడు పొలంమెళ్ళి, ఆట్టే వొళ్ళువంచి పని జేయక పోయినా ఆ దార్ఢ్యత తగ్గలేదు మనిషిలో. జుత్తుకూడా

పూర్తిగా నెరవలేదు. కుచ్చు మీసాలు ఆయన గాంభీర్యానికీ, జీవితం పట్ల గల నిశ్చయమైన దృక్పథాలకూ నిదర్శనాలు.

భార్య శాంతమ్మ హాలులో ఈతాకుల చాపమీద మినప్పప్పు చెరుగుతూంది. గోవిందయ్య కొయ్య భోషాణంపై వున్న బుట్టలో వంకాయలు గుమ్మరించి, పై పంచ దులుపుతూ, "దేనికే మినపప్పు చేస్తున్నావ్?" అన్నాడు భార్యతో.

"అబ్బాయి వస్తాడుగా! సున్నివుండలు చేదామని'..." అన్నది శాంతమ్మ కొడుకుపై గల ప్రేమకు తన శ్రమ చిహ్నమైనట్లు.

"అఘోరించలేక పోయావ్! వెన్నపూస సవాసేరు రూపాయి ముప్పావలా అమ్ముతూంటే, ఇంట్లో వున్న నెయ్యి కాస్తా సున్నివుండలకు ధారాగతం చేస్తావా? నీ తెలివి తెల్లవారినట్లేవుంది ఇట్లాంటి పిచ్చిపిచ్చి ఖర్చులు చేయక. ఆ నెయ్యి జాగ్రత్త చేయి. అబ్బాయి పెళ్ళి వస్తూన్నదిగా! అక్కరకు వస్తుంది!..." అన్నాడు గోవిందయ్య గొంతు చించుకుంటూ.

శాంతమ్మ నోరు ఆరిన అప్పడంలా ముడుచుకు పోయింది.

ఆ సమయంలోనే కంట్రాక్టరు అప్పలనరసయ్య ఇంటి వసారాలోకి వచ్చి "గోవిందయ్యమామా!" అని కేక వేశాడు.

"ఆఁ వస్తూన్నా!" గోవిందయ్య హాలులోంచి బయటికి వచ్చాడు.

"కూర్చో అల్లుడూ!"

ఇద్దరూ అరుగుమీద కూర్చున్నారు. కొన్ని క్షణాలపాటు నిశ్శబ్దం జరిగిపోయింది.

"ఏమిటి విశేషాలు? బాకీ తీర్చడానికి వచ్చేవేమిటి?"

"లేదు మామా! ఆరవీడు రోడ్డు తాలూకా ఫైనల్ బిల్లు ఇంకా రాలేదు. ఇంతలో మరో రోడ్డు కాంట్రాక్టు తీసుకున్నాను. మెటీరియల్ తోలడానికి ఓ అయిదు వేలు అర్జంటుగా కావాల్సి వచ్చాయి. ఓ రెండువేలు అయినా నువ్వు సర్దితే, తాత్కాలికంగా పని గడుస్తుంది. ఈ డబ్బూ, పాత నోటు తాలూకూ రెండు మూడు నెలల్లో బిల్లులు రాగానే తీరుస్తాను."

"ప్చ! నిన్న సందకాడ చెంచుపున్నయ్య పట్టుకెళ్ళాడు ఓ మూడువేలు. ఓ ఎకరంన్నర నిమ్మతోట కొన్నాడట. రేపే రిజిస్ట్రేషన్ కామోసు! అదీగాక మావాడి పెళ్ళి. దేముడు మేలుచేస్తే ఆ పాలెం మునసబుగారి సంబంధం కుదిరితే, ఈ నెల చివరనే జరగొచ్చు. మరి ఆ పెళ్ళి ఖర్చులకు పైకం కావొద్దూ!"

కంట్రాక్టరు అప్పలనరసయ్య కొన్ని క్షణాలపాటు ఏమీ తోచక దిక్కులు లెక్కపెట్టాడు.

"ఈ అవసరాన్ని ఆదుకోక తప్పదు మామా! కనీసం

రూపాయిన్నర వడ్డీకైనా ఎంతో కొంత నువ్వు ఇవా ల్సిందే!"

గోవిందయ్య వాలకంలో హఠాత్తుగా మార్పులు కలి గాయి. మెత్తబడ్డాడు. కనుబొమలు ముడిచి, సానుభూతిగా ఆలోచించినట్టు ఆలోచించి — "నీ అవసరాన్ని చూస్తూంటే నా మనస్సు కరిగిపోతూన్నది. ఓ పదిహేను వందలిస్తాను పట్టుకెళ్ళు. రివెన్యూ బిళ్ళలు తెచ్చుకున్నావు గదూ!" అన్నాడు గోవిందయ్య.

'అవు' నన్నట్టు తల ఆడించాడు కంట్రాక్టరు అప్పల నరసయ్య.

గోవిందయ్య ఇంట్లోకి వెళ్ళాడు మొలనున్న తాళం చెవుల్ని సవరించుకుంటూ.

గోవిందయ్య అక్షరాలా డబ్బు మనిషి. డబ్బు ముందు బంధుత్వాన్నీ, మానత్వపు విలువల్నీ, సహజమైన స్వభావా లనూ లక్ష్యపెట్టడు. లక్షలు కూడబెట్టటమే ఆయన బ్రతుక్కు మోక్షం. ఆ మోక్షానికి ఒక్కొక్క మెట్టు ఎక్కి వచ్చాడు. కాని గమ్యస్థానం యింకా అందుబాటులో లేదు. తాను ఒక్కొక్క మెట్టు ఎక్కినకొందికీ. అది వెనక్కు జరుగసాగింది. ఆ మాయ బోధపడటంలేదు. అయినా దాన్ని గురించి ఆలో చించుకొని బుర్ర బ్రద్దలుకొట్టుకోటంలేదు. జీవితంలో ప్రతి వ్యక్తీ సర్వసాధారణంగా ఒక్కొక్క వ్యామోహానికి దాసుడు కావడం కద్దు. గోవిందయ్య డబ్బు వ్యామోహానికి బానిస. ఆ వ్యామోహానికీ, కండూతికీ అంతం లేదని తెలిసికూడా — అందులోబడి దొర్లడం ఆయన జీవిత ధ్యేయం. ఓ విధమైన

సంతృప్తి... ఆయనకు ఓ లాటరీలో అదృష్టం తిరగబడి వెతుక్కుంటూ రాలేదు; ఏ నారసుని ఆ స్త్రీ ఉద్రుడియంగా సంక్రమించలేదు: వ్యాపారం చేసి, తోటివాళ్ళను నట్టేట ముంచి ఆర్జించలేదు. నిజంగా ఆయన సంపాదన అద్భుతమైన ఇంద్రజాలమే. మూడెకరాల ఆసామి గోవిందయ్య ముప్పై ఏళ్ళలో మూడు లక్షలకు అధికారి. ఆయన సంపాదనంతా స్వశక్తితోనే. కఠినమైన సంపాదనా సూత్రాల సహాకాకంతోనే ఒక రూపాయిని రెండో రూపాయి చేయటం చాల కష్టం; ఒక లక్ష రూపాయలను రెండు లక్షల రూపాయలుగా చేయడం బహు తేలిక. ఆ కిటుకు గ్రహించి, ఆచరణలో కృతకృత్యుడైనాడు గోవిందయ్య.

డబ్బు సంపాదనే జీవిత లక్ష్యంగా కలవానికి ఎట్లాంటి అలవాట్లు ఉండాలో, ఎట్లాంటి మన స్తత్వం వుండాలో, మనస్సును ఎన్ని నియమాలమధ్య ఇరికించాలో, మానవ సహజమైన ఎన్ని గుణాల్ని నిర్లక్ష్యం చేయాలో – అన్నీ గోవిందయ్యలో మూర్తీభవించి ఉన్నాయి. ఆయన కడుపునిండా తినడు; ఎట్లాంటి తీపిపదార్థం చూసినా ఆయన జిహ్వపై లాలాజలం వూరదు; ఆయన మస్తిష్కం కోర్కెల కలగూరగంప కాదు; భౌతిక సుఖాల నిమిత్తం ఆయన ఇంద్రియాలు ఆవురావురు మనవు; ఆయనకు కంటినిండా ఎప్పుడూ నిద్ర వుండదు; అహర్నిశమూ విశ్రాంతి లేకుండా పలు ఆలోచనలతో, భయాలతో, ఆదుర్దాలతో సతమతమవుతూనే వుంటాడు. అర్ధరాత్రుళ్ళు లేచి, ఇనుప భోషాణం ముందు కూర్చుని – పెట్టెలోని డబ్బునూ, ప్రోమిసరీ నోట్లనూ, రావా

ల్సిన పడ్డీనీ లెక్క చూసుకుంటూ వుంటాడు. మొత్తం తన దగ్గర వున్న డబ్బును చూసికొని సంతృప్తిగా నిట్టూర్పు విడుస్తూ వుంటాడు.

*        *        *

పదవ తారీఖునాడు శంకరం ఇంటికి రాలేదు. గోవిందయ్య గాబరాపడ్డాడు. కాలుగాలిన పిల్లిలా తిరిగాడు.

పెళ్ళి చూపులకు వెళ్ళాల్సింది పన్నెండో తారీఖు. ఆ రోజు తీక్షణంగా ఎదురు చూశాడు గోవిందయ్య కొడుకు కోసం. కాని శంకరం ఆ రోజుకూడా రాలేదు — నిరుత్సాహంతో నీళ్ళల్లో తగిసిన చుట్టవలె నీలుక్కుపోయాడు.

కాని ఆరోజు శంకరం దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

"...నాకు మీరేమీ పెళ్ళి సంబంధం నిశ్చయించనక్కర్లేదు. నేను ఇక్కడ హరిజన యువతిని ప్రేమించాను. ఆమె నా క్లాసుమేటు. మే మిద్దరమూ సాధ్యమైనంత త్వరలో రిజిస్టర్ మ్యారేజి చేసికోబోతున్నాము. మీకు ఆశ్చర్యంగానూ, ఆగ్రహకారణంగానూ వుండవచ్చు. కాని ప్రేమకు సఫలత వివాహమే. కాలం మారింది. కేవలం డబ్బు సంపాదనలోనే ప్రపంచం లేదు. డబ్బుకు మించిన విలువలు అనేకం ఉన్నాయి. ఆ విలువలద్వారానే మనిషి ఉదాత్తుడవుతున్నాడు అన్ని కళలలోకీ డబ్బు సంపాదించే కళ అధమమైనది. ఆ కళారాధనలో స్వార్థానికీ, సంకుచితానికీ స్థానమున్నది గాని విశాల హృదయ స్వభావానికీ, మానసిక ఔన్నత్యానికీ స్థానం లేదు. సంఘసంస్కారమూ, సాంఘికాభ్యుదయమూ, కులమత వర్గరహిత ప్రజాస్వామికమూ

దేశంలో అమల్లోవున్న యీ తరుణంలో పూర్వాచారాలతో, బూజుపట్టిన భావాలతో కూపస్థ మాండూకం వలె బ్రతకటం శోచనీయం..."

గోవిందయ్య ఆ లేఖ చదువుకొని మొదలు నరికిన వృక్షంలా కూలిపోయాడు.

శాంతమ్మకు దుఃఖం వరద వెల్లువయైనది.

గోవిందయ్య ఓ మాదిరిగా తేరుకునేటప్పటికి పావు గంటకాలం జరిగింది. క్రమేపీ ఆయన నిశ్చేష్టత కరిగిపోయి, కోపావేశం ఉధృతరూపాన్ని ధరించింది. చిందులు త్రొక్కాడు.

"ఛీ-ఛీ! వాడు నా కడుపున చెడబుట్టాడు వాడిలో నా రక్తం ప్రవహించలేదు. ఎంత బరితెగించాడు? నన్ను లెక్క-చేయడంలేదు. ఇంత కాలమూ, యిన్ని కష్టాలూపడీ, మట్టితిని సంపాదించింది ఎవరికోసం? ఈ నాడు వాడి ముఖాన ప్రొద్దుపొడిచిందా? తలకు కొమ్ములు మొలిచాయా? ఎంత అప్రతిష్ఠ! నలుగురితో యెంత పలుచన? వాడి శ్రేయస్సు మీద యెన్నో ఆశలు పెట్టుకొని, వాడి భవిష్యత్తును గూర్చి యెన్నో కలలు కంటూ యం. బి. బి. యస్. చెప్పిస్తూంటే-వాడు ఒక మాదిగ పిల్లను ప్రేమిస్తూ. పెళ్ళి చేసికుంటాననంటాడా? అది సంస్కారమా, సాంఘికాభ్యుదయమా. కని-పెంచిన తల్లిదండ్రులూ, వంశ గౌరవమర్యాదలూ, ఇరుగు పొరుగూ, సాంఘిక కట్టుబాట్లూ-ఏమైనా ఆలోచించాడా. ఇవతల లక్షరూపాయల కట్నంతో బంగారుబొమ్మలాంటి పిల్లనిస్తామని వస్తోంటే వాడు బురదలో దొర్లుతానంటాడా.

వాడిట్లా పెడదారి త్రొక్కటానికి నేనే కారణం. నేను నికృష్టంగా బ్రతికి సంపాదించిన డబ్బే వాడ్ని చెడగొట్టింది. నేను డబ్బు కూడబెట్టకపోతే, ఆ మూడెకరాల మాగాణితోనే వుంటే, సంపాదించిన డబ్బంతా విలాసాలకూ, వినోదాలకూ విచ్చలవిడిగా ఖర్చుబెడితే_ వాడీ చదువు చదివేవాడా. ఈ పోకిళ్లు పోయేవాడా. తల్లిదండ్రుల కడుపుల్లో యీ చిచ్చును రగిలించేవాడా. ఎక్కడకక్కడ కోర్కెల్ని త్రుంచివేసికుంటూ పైసాను రూపాయిలా చూసికుంటూ, లేమినే జీవితంలో అనుభవిస్తూ లక్షలు సంపాదిస్తే _ వీడికి నాపై చిన్నమెత్తు లక్ష్యం లేదు. నా పరువు ప్రతిష్ఠల్నే బజారు కీడ్చుస్తున్నాడు. సాటివాళ్ళ ఎదుట ముఖమెత్తుకొని తిరిగే యోగం లేకుండా జేస్తున్నాడు. ఏడేం చూసుకొని ఇట్లా మిడిసిపడుతున్నాడు.”

భర్తరంకెలకు శాంతమ్మ దిగాలుపడి చూస్తూ కూర్చుంది దుఃఖాన్ని కడుపులో యిముడ్చుకుంటూ.

ఆ రోజు మధ్యాహ్నమే గోవిందయ్య గుంటూరు వెళ్ళాడు; కొడుకుపరిస్థితుల్ని యదార్థంగా చూచి రావడానికి.

బస్సు దిగీ దిగటంతోనే అంత దూరాన రిక్షాలో ఓ యువతి కూర్చుని వుండడం గోవిందయ్య మనస్సునుకలుక్కుమనిపించింది. కొన్ని క్షణాలపాటు నిర్విణ్ణుడై అల్లానే రోడ్డు ప్రక్క స్తంభంలా నిలబడిపోయాడు.

శంకరంగదికి వెళ్ళాడు గోవిందయ్య కాళ్ళీడ్చుకుంటూ. శంకరం రూమ్‌మేట్ జగన్నాథరావు ద్వారా అన్ని విషయాలూ తెలుసుకున్నాడు. ఆ మాయదారి ముండవలలోపడి,

డబ్బు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుచేస్తున్నాడు. కాలేజీకి రావడంలేదు. అసలీ టరమ్ ఫీజు కూడా చెల్లించలేదు! దాని చీరెలకూ, పౌడర్లకూ, జల్సాలకూ డబ్బు ఖర్చుపెడుతున్నాడు! నేను యెన్ని చెప్పినా నా నోరు నొప్పిపుట్టడమే గానీ ఒక్కమాట కూడా వినడంలేదు. మీరే అతన్ని అదుపు ఆజ్ఞల్లో పెట్టుకోవాలి" అన్నాడు జగన్నాథరావు చివరకి. ముఖాన కత్తివాటుకు నెత్తురుచుక్క లేకుండా, నీరసపడి నిస్పృహతో ఆ సాయంకాలం గుంటూరునుంచి యింటికి చేరాడు గోవిందయ్య.

* * *

తండ్రి అటు వెళ్ళగానే రూమ్‌కి వచ్చాడు శంకరం. అతని ముఖంపై విచార మేఘాలు వ్రేలాడుతున్నాయి. జీవితంలో తీరని ఆశాభంగం పొందినట్లు వాలకం చెప్పక చెబుతూన్నది.

"ఏం జరిగిందిరా బ్రదర్?" అన్నాడు జగన్నాథరావు.

"కొంపే మునిగింది. నీల బండారం బయట పడింది. దాని క్యారెక్టర్ మంచిది కాదు. కాలేజీలో చేరక ముందే ఒక శిశువుని కని, అనాథశరణాలయానికి అప్పగించిందట. ఇందాక డాక్టర్ కృష్ణమూర్తి చెప్పాడు. ఎంత ఘోరం, నా మతి పోతుంది" అన్నాడు శంకరం బాధతో కూడుకున్న చీకాకుతో.

గోవిందయ్య వొచ్చి వెళ్ళిన సంగతి చెప్పాడు జగన్నాధరావు. మరీ బాధపడ్డాడు శంకరం.

ఆ కిలాడిని నమ్ముకొని, గుడ్డిగా ప్రేమించి, నాన్న మనస్సును క్షోభ పెట్టాను. ఒక మంచి సంబంధం వెదికితే, పెళ్ళిచూపులకు పోకుండా ఒక ఉత్తరం వ్రాశాను. హరిజన యువతిని పెళ్ళిచేసుకోబోతున్నట్టు, తన పెళ్ళి విషయంలో జోక్యం కలుగచేసికోవద్దన్నట్టు – పాపం! నాన్న ఎంతగా వ్యథ చెందాడో!"

"ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. వెంటనే ఇంటికి వెళ్ళు. తండ్రికి క్షమాపణ చెప్పుకొని, ఆయన నిర్ణయించిన సంబంధాన్నే చేసుకో–పాపం ఆయన్ను చూస్తుంటే నాకు విపరీతమైన జాలి వేస్తోంది."

గదిలో పచార్లు చేస్తూ దాదాపు పావుగంటసేపు తీవ్రంగా ఆలోచించాడు శంకరం. దృఢంగా ఓ నిర్ణయాని కొచ్చాడు. జిప్ బ్యాగ్‌లో దుస్తులు సర్దుకొని యింటికి ప్రయాణ మైనాడు.

శంకరం బస్సు దిగేసరికి కనుచీకటి ముదిరింది. సంచి చేత్తో పట్టుకొని ఫర్లాంగున్నర దూరం నడిచి ఇంటికివచ్చాడు. శంకరం రాకను బజార్లలో కూర్చున్న వాళ్ళంతా గమనించారు.

వీధి తలుపు తెరుచుకొని ఇంట్లోకి వెళ్ళాడు. నట్టింట్లో దీపం వెలుగుతూంది. ఆ వెలుగు వసారాలోకి కిటికీల్లోంచీ, ద్వారంనుంచీ పడుతూన్నది. వసారా అరుగుమీద గోవిందయ్య కాలుమీద కాలువేసుకొని కూర్చుని ఉన్నాడు.

నట్టింట్లోనుంచి సన్నని పొగ కామోసు ననుకున్నాడు శంకరం.

కొడుకు రావడాన్ని చూసి గోవిందయ్య పెద్దగా వసారా బూజురాలేట్టు నవ్వాడు. శంకరానికి అర్థం కాలేదు.

ఇంట్లోనుంచి తల్లి ఏడుపు వినిపించింది.

శంకరం ఏదో దారుణం జరిగుంటుందని భయపడ్డాడు.

"వచ్చావా నా తండ్రీ! రా! నీ ప్రియురాలేది? ఆ హరిజన పిల్ల...! రిజిష్టరీ మ్యారేజి చేసికున్నావా? సంఘ సంస్కారమూ, సాంఘికాభ్యుదయమూ! నీ ప్రేమ సఫలమైందిగా? అదే చాలు. కేవలం డబ్బు సంపాదనతోనే ప్రపంచం లేదుగా! డబ్బుకు మించిన విలువలు అనేకం ఉన్నాయి. అన్ని కళలలోకీ డబ్బు సంపాదించే కళ అధమమైనది. ఆ సంగతి ఇవాళే తెలిసికున్నాను. అందుకే సంపాదించిన డబ్బునంతా నాశనం చేశాను. నా మనస్సు ఎంతో ప్రశాంతంగా వుంది. నా సంపాదనకు విలువ లేనప్పుడు—ఆ సంపాదనెందుకు? ఇవాళనుంచీ నేను బీదవాణ్నే. నాకు యెవ్వరూ పైసా బాకీ లేదు. నా ఇంట్లో రూపాయి నిల్వలేదు. అంతా అగ్నికి ఆహుతై పోయింది. ఇన్నాళ్ళకు నిజం తెల్సుకున్నాను— డబ్బుతో మనుషుల విలువల్ని అంచనా వేయలేము. డబ్బుతో మమతల్నీ, మమకారాలనూ పెంచుకోలేము: డబ్బుతో సుఖపడలేము. డబ్బు మనశ్శాంతికి ప్రథమ శత్రువు. జీవితంలో నేను పెట్టుకున్న ఆశయాలూ, వాటికోసం అనుసరించిన మార్గాలూ, పడిన శ్రమా, తాపత్రయమూ—అన్నీ వృథా!

వృథా! !...నీ ఇష్టమొచ్చినట్టు నువ్వు బ్రతుకు, ఒకళ్ళను బాగుచేయడానికి మరొకళ్లు సంపాదించడం, ఒకళ్ళ శ్రేయస్సు కోసం మరొకళ్లు జీవితాన్ని నికృష్టపర్చుకోడం – ఎంత అవివేకమో యిప్పుడు తెల్సుకున్నాను. ఈ రోజు జీవితంలో పెద్ద పండుగ!..."

గోవిందయ్య ముఖమంతా నోరుచేసుకొని పిచ్చిగా నవ్వసాగాడు.

శంకరం దిగ్భ్రాంతుడై నిల్చుండిపోయాడు కొన్ని క్షణాలపాటు.

గోవిందయ్య కసిదీరక నవ్వుతూనే ఉన్నాడు.

ఇంట్లోకి వెళ్ళాడు శంకరం.

మండువా యింట్లో దక్షిణపు ప్రక్క కిటికీ దగ్గర కాగితాల కట్టలు తగలబడిన నుసిప్రోగుగా పడివుంది. శాంతమ్మ ఆ నుసివద్ద కూలబడి దీర్ఘంగా ఏడుస్తూవుంది.

జరిగిన దారుణమంతా శంకరానికి కళ్ళకు గట్టినట్టు అర్థమైంది.

ఇంటి వసారాలో అరుగుమీద కూర్చున్న గోవిందయ్య బిగ్గరగా నవ్వుతూనే ఉన్నాడు.

—నెలవంక